# స్వర బంధనం

## -చాగంటి నాగరాజారావు

రాధ మధుర గానం ఇప్పటికీ రాజేష్ చెవుల్లో మారుమ్రోగుతూనే వుంది. తంజావూరులో ఆమె గానామృతాన్ని గ్రోలి రెండేళ్లయ్యింది. క్రితం సంవత్సరం గానసభల్లో కార్యనిర్వాహకులు ఆమె గాత్ర సంగీత కచేరి ఏర్పాటు చేయలేక పోయారు. ఈ సంవత్సరం తప్పకుండా రాధ గాన కచ్చేరి ఉంటుందని నిశ్చయించుకున్నాడు రాజేష్.

రాజేష్ సంవత్సరం క్రితమే కోయంబత్తూరులో ఒక ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగంలో చేరాడు. తంజావూరులో ప్రతి యేటా జరిగే గానసభలకి అలవాటుగా వారం రోజులు శెలవుపెట్టి వెళ్లాడు. తీరా అక్కడికి వెళ్లాకే తెలిసింది. తన అభిమాన గాయని రాధ ఇక జీవితంలో కచ్చేరీ చెయ్యనందని. రాజేష్ ఆశ్చర్యానికి అంతులేదు! ఆ వార్త సంగీత ప్రపంచాన్నే దిగ్భ్రాంతిలో ముంచెత్తింది. సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం అదే వేదిక మీద నుంచి గానకళకోసం, ఆ కళని భావితరాల వారికి అందించడం కోసం తన జీవితాన్ని అంకితం చెయ్యదలచానని ఆమె ప్రకటించింది. ఇంతలోనే ఇటువంటి విపరీత నిర్ణయాన్ని ఎందుకు తీసుకుందో రాజేష్‌కి ఓ పట్టాన అర్థం కాలేదు.

రాధ గాత్ర కచ్చేరీ లేనప్పుడు రాజేష్‌కి శెలవు వృథా చేసుకుని తంజావూరులో ఉండ బుద్ధి కాలేదు. శెలవు రద్దు చేసుకుని తిరిగి వచ్చి డ్యూటీలో చేరిపోయాడు. ఫైల్సు ముందు వేసుకుని ఆఫీసు పనిలో నిమగ్నమైనా రాజేష్ మనసు మాత్రం రెండేళ్ల క్రితం నాటి రాధ జ్ఞాపకాల మీదే కేంద్రీకృతమై ఉంది. అతని మనసు ఆ మధుర స్మృతులలోనే తేలియాడుతోంది.

★★★

ఆ రోజే సంక్రాంతి గాన సభలు ప్రారంభం. వారం రోజుల పాటు జరిగే ఆ కార్యక్రమాలు రాధ గాత్ర సంగీత కచ్చేరీతో ప్రారంభమయ్యాయి.

వర్ణంతో కచేరీ ప్రారంభమైంది. రాధ గానానికి రసజ్ఞ హృదయులందరూ ఆనంద పరవశులై సాక్షాత్తూ గంధర్వ లోకంలో విహరిస్తున్నారు. వర్ణం పూర్తి కాగానే రాధ హిందోళ రాగాలాపన ప్రారంభించింది. ఆలాపన పూర్తి కాగానే వాయులీనమ్మీద సహకార విద్వాంసుడు ఆలాపన ప్రారంభించాడు. ఆమె ఏ కృతి పాడుతుందా అని ప్రేక్షకులు ఆత్రంగా కళ్లు పెద్దవి చేసుకొని చెవులు రిక్కించి వింటున్నారు. 'బహుశా సామజ వరగమన' అనే కృతిని పాడవచ్చు, అని కొందరు ఊహిస్తున్నారు. అంతలో రాజేష్ మనసులో ఒక ఆలోచన మెఱుపులా మెరిసింది. 'మనసులోని మర్మమును తెలుసుకో' అనే కృతిని పాడమంటే నా మనసులోని మర్మ మేమిటో రాధకి అర్థమవుతుంది.' అనుకుని ఒక చిన్న చీటీమీద ఆ పాట పాడమని రాసి వేదిక దగ్గరకెళ్లి ఆమె ముందు ఆ చీటీని పెట్టాడు రాజేష్. వాయులీనమ్మీద రాగాలాపన పూర్తి కాగానే రాజేష్ వైపు తిరిగి చిన్న చిరునవ్వు నవ్వి తాను పాడమని అడిగిన కృతిని పాడ్డం ప్రారంభించింది రాధ. ఒక్కసారిగా రాజేష్ మనసు ఆనందాకాశంలో విహరించింది.

శాస్త్రీయ సంగీతంలో తనకి తానే సాటి అనిపించుకున్న రాధ గానానికి ప్రేక్షకులు నిశ్చేష్టులౌతున్నారు. ప్రేక్షకులంతా రాధమీద ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.


''రాధ అంటే సాక్షాత్తూ సరస్వతీ పుత్రిక అనుకోండి. లేకపోతే ఇంత మధురంగా పాడ్డం అసంభవం'' అన్నాడో రసజ్ఞహృదయుడు.

''ఎవరో మహా వాగ్గేయకారుని వంశంలో రాధ జన్మించి ఉంటుంది'' అన్నాడు మరొకాయన-సంగీతాంబుధిలో తేలియాడుతూ.

''ఈ గంధర్వ విద్యను ప్రదర్శించడానికి భగవంతుడు కొందరిని మాత్రమే ప్రత్యేకంగా ఎన్నుకుంటాడండీ. అటువంటి వారిలో రాధ ఒకరు'' అని ప్రశంశించాడు మరొకాయన.


కృతి అనంతరం రాధ రాగం-తానం, పల్లవి అందుకుంది. రాగాలాపన, తానం పూర్తయ్యాయి. పల్లవి అందుకునేలోగా రాజేష్ తన కుర్చీలోంచి లేచి డ్రెస్సు బెల్టు సరి చేసుకుని బయటికి వెళ్లడానికి రెండడుగులు వేసేసరికి-

''వెడలెను సింగారించుకుని'' అని పల్లవి నందుకుంది రాధ. దాంతో బయటికి అడుగులు పడక అక్కడే ఠక్కున ఆగిపోయాడు రాజేష్. ఒక్కసారి వెనక్కి తిరిగి వేదిక వైపు చూశాడు.



అతని వైపే చూస్తూ పాడుతున్న రాధ వెంటనే తన దృష్టిని చిరునవ్వుతో మరో వైపు తిప్పి పాటని కొనసాగించింది.

'మన మధ్య ఎన్నో జన్మల బంధం ఉండి ఉంటుంది. లేకపోతే ఇంత అవినాభావ సంబంధం ఎందుకుంటుంది!' అనుకున్నాడు రాజేష్ తప్పనిసరిగా.



★★★

గత స్మృతులు నెమరు వేసుకుంటున్న రాజేష్ జవాను పిలుపుతో వర్తమానంలోకి వచ్చాడు.

''అయ్యా! ఎం.డి.గారు తమర్ని రమ్మంటున్నారు'' అన్నాడు జవాను.

ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కుమార్‌కి శాస్త్రీయ సంగీతం అంటే పరమ అసహ్యం. పాశ్చాత్య సంస్కృతికి మోజుపడే కుమార్ స్వదేశీ సంస్కృతిని హీనంగా చూస్తాడు. శాస్త్రీయ సంగీతాన్ని ఖూనీ రాగాలని వర్ణిస్తాడు. అందుకే అతనంటే రాజేష్‌కి అసహ్యం. కాని అతని పై అధికారి కావడంతో రాజేష్‌కి కుమార్‌ని కలవక తప్పలేదు.

సార్?'' కుమార్ గదిలోకి అడుగుపెడుతూ అన్నాడు రాజేష్.

''వాట్ మిస్టర్ రాజేష్! పెట్టిన శలవు రద్దు చేసుకుని అంత త్వరగా వచ్చేశావేమోయ్! ''పిల్చారా తంజావూరు కచ్చేరీలు లేవా? అదే, ఖూనీరాగ సభలు లేవా?'' రాజేష్‌ని చిన్నబుచ్చాలనే ఉద్దేశ్యంతో అన్నాడు కుమార్.

''లేకనేమి సార్! చాలా ఉన్నాయి. కాని మీరన్నారే ఖూనీరాగాలని? వాటి కోసం శెలవు వృధా చేసుకోవడ మెందుకని తిరిగి వచ్చేశాను'' తనూ వ్యంగ్యంగానే సమాధానమిచ్చాడు రాజేష్.

''వెరీ గుడ్! ఇన్నాళ్లకి నువ్వు నాదారి కొచ్చావు. పెళ్లికి ముందు నా భార్యక్కూడా నీలాగే శాస్త్రీయ సంగీతం పిచ్చి ఉండేది. పెళ్లయ్యాక ఆమెకి మంచి గుణపాఠం నేర్పాను. నేనామెను పెళ్లాడింది ఆమెలోని అందాన్ని చూసి కాని, ఆమెలోని గాన కళని చూసి కాదని. అందుకే కచ్చేరీలు చెయ్యడం మాన్పించేసాను.'' అన్నాడు కుమార్.

''సార్! మేడంగారి పేరు......?''

''రాధ'' అన్నాడు కుమార్ నవ్వుతూ.

ఆ అందమైన పేరు వినడంతోనే తన చెవుల్ని తానేనమ్మలేక పోయాడు రాజేష్.

ఒక్కసారి విషయం అర్థమైన తర్వాత జీవితంలో రాధ ఎంత పోగొట్టుకుందో యోచించాడు.

ఆమె పోగొట్టుకున్నది సరిగ్గా తాను పోగొట్టుకున్న దానితో సమానం-అని రూఢి చేసుకుంటూ బయటకు నడిచాడు రాజేష్. ★